పాత కక్షలతోనే హత్య

ఇద్దరు నిందితుల అరెస్టు

సదాశివపేట, న్యూస్‌టుడే: స్నేహితుల మధ్య విభేదాలు, పాత కక్షలే హత్యకు దారితీశాయి. సదాశివపేట పట్టణం సిద్దాపూర్ కాలనీకి చెందిన అనిల్‌రాజ్ హత్య కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మహేష్‌గౌడ్ శుక్రవారం తెలిపిన వివరాలు.. సిద్దాపూర్ కాలనీకి చెందిన ఎం.అజయ్‌రాజ్.. హత్యకు గురైన అనిల్‌రాజ్ మధ్య విభేదాలు ఉన్నాయి. అనిల్‌రాజ్ కుటుంబం వల్లనే తన కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని అజయ్‌రాజ్ కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 20న రాత్రి మద్యం పార్టీ చేసుకుందామని సిద్దాపూర్ కాలనీలోని ప్రభుత్వ నర్సరిలోకి తీసుకెళ్లాడు. తన మరో స్నేహితుడు రాజేశ్‌తో కలిసి ముగ్గురు మద్యం తాగారు. ఇద్దరూ కలిసి అనిల్‌రాజ్‌ను కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు విచారణ చేపట్టారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీరించారు. శుక్రవారం వారిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఝరాసంగం: కేజీబీవీ, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ డీడబ్ల్యూవో మండల ప్రత్యేకాధికారి లలితా కుమారి సూచించారు. శుక్రవారం ఝరాసంగం కేజీబీవీ, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీడీవో సుధాకర్, సీడీపీవో అంజమ్మ, పర్యవేక్షకులు అనితకుమారి, రాధమ్మ, కార్యదర్శి సరస్వతి పాల్గొన్నారు.

పేదల వైద్యానికి నూతన ఒరవడి

- రోగుల చెంతకు వెళ్లనున్న నిపుణులు
- వారంలో మూడు రోజులు అమలు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్



సర్కారు దవాఖానాలు పేదల వైద్యానికి భరోసా కల్పిస్తున్నాయి. జ్వరం, దగ్గు, టైఫాయిడ్, డెంగీ, దీర్ఘకాలిక వ్యాధులు తదితరాల వైద్యానికి రోగులు స్థానికంగా ఉండే ప్రభుత్వ ఆసుపత్రులకు పరుగులు తీస్తారు. అక్కడా నయం కాకుంటే ప్రాంతీయ ఆసుపత్రులు.. లేదంటే జిల్లా దవాఖానాకు వెళ్లాల్సి వస్తోంది. రోగులతో పాటు కుటుంబీకులకు వ్యయ ప్రయాసలు తప్పేవికావు. ఇకమీదట ఇలాంటి ఇబ్బందులకు చెక్‌పెట్టాలని వైద్యారోగ్యశాఖ భావిస్తోంది. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో అన్నిరకాల పరీక్షలు చేసి అక్కడే కీలక విభాగాల వైద్య నిపుణుల ద్వారా సేవలు అందించేందుకు ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టనున్నది. వారంలో మూడు రోజులు పాటు ఎంపిక చేసిన ప్రభుత్వ దవాఖానాలకు వైద్య నిపుణులు వెళ్లి సేవలు అందించనున్నారు. ప్రధానంగా తొమ్మిది రకాల వైద్య సేవలు అమలు చేయనున్నారు. త్వరలో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

కార్యాచరణ ఇలా..

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య ఉప కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో సోమ, మంగళ, గురు వారాల్లో మూడు రోజుల పాటు వైద్య నిపుణులు రోగుల వద్దకు వెళ్లి సేవలందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్యశాఖ తొమ్మిది రకాల వైద్య నిపుణులను ఎంపిక చేసిన దవాఖానాలకు పంపించి వైద్య సేవలు అందించనున్నారు. తొలుత రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం మందులు అందజేస్తారు. రోగుల్లో పరిస్థితి విషమంగా ఉంటే సమీపంలోని జిల్లా, ప్రాంతీయ, సామాజిక దవాఖానాలకు పంపిస్తారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రోగులకు వ్యయ ప్రయాసలు, ఆర్థిక భారం తప్పనున్నాయి.

అందుబాటులో ఉండే వైద్యులు

- మహిళా వైద్య నిపుణులు
- చిన్న పిల్లల వైద్యులు
- జనరల్ మెడిసిన్
- జనరల్ సర్జన్
- ఆర్థోపెడిక్
- మానసిక వైద్య నిపుణులు
- చెవి, ముక్కు, గొంతు(ఈఎన్‌టీ)
- దంత వైద్యులు

ఎంపిక చేసినవి

- పీహెచ్‌సీలు: 30
- యూపీహెచ్‌సీలు: 4
- బస్తీ దవాఖానాలు:19

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో తొమ్మిది రకాల వైద్య సేవలపై ప్రధానంగా దృష్టి సారించనున్నాం. రోగుల వద్దకు వైద్య నిపుణులు వెళ్లి వైద్యం అందించాలని నిర్ణయించడం శుభ పరిణామం. ఎంపిక చేసిన మూడు రోజుల్లో ఏయో దవాఖానాలో సేవలు అమలు చేయనున్నారనే విషయాన్ని.. పల్లెలు, పట్టణాల్లో ముందస్తుగా ప్రచారం చేయిస్తాం. సమీపంలో ఉన్న రోగులు అక్కడికి వెళ్లి సేవలు పొందడానికి అవకాశం కల్పిస్తాం. నిపుణుల పర్యవేక్షణలో ఉచితంగా ఆరోగ్య పరీక్షలతో పాటు మందులు, అందజేస్తాం. జిల్లాలోని ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి.- **గాయత్రీదేవి, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి.**

నకిలీ ఇంటినంబర్లు.. అక్రమ రిజిస్ట్రేషన్లు

గడ్డపోతారంలో వెలుగు చూసిన అక్రమం

న్యూస్‌టుడే, జిన్నారం: ఇంటి నిర్మాణ అనుమతి పొందాలంటే.. నింబంధనల ప్రకారం స్థలం వివరాలు సమర్పిస్తూ యజమాని ఆన్‌లైన్ ద్వారా సంబంధిత పంచాయతీ కార్యాలయానికి దరఖాస్తు చేయాలి. పంచాయతీ కార్యదర్శి క్షేత్ర స్థాయిలో పరిశీలించి స్థల విస్తీర్ణం, హద్దులు, పత్రాలు పరిశీలించి సరైనవేనని తేల్చితే.. నిర్మాణ అనుమతి మంజూరు చేస్తారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఇంటి నంబరు కేటాయిస్తారు. ఇందుకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం రుసుం చెల్లించాలి. ఈ నిబంధనలన్నీ తుంగలో తొక్కి కొందరు అక్రమార్కులు దొడ్డిదారిలో వ్యవహరిస్తున్నారు. నకిలీ ఇంటినంబర్లు సృష్టించి.. ప్రభుత్వ స్థలాలనూ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కొన్ని పరిశ్రమలు సైతం ఈ అక్రమ మార్గాన్ని అనుసరించినట్లు తెలుస్తోంది. జిన్నారం మండలం గడ్డపోతారం పంచాయతీ పరిధిలో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది.



ప్రభుత్వ స్థలాల విక్రయానికి..: ప్రభుత్వ భూములు ప్లాట్లుగా చేసి.. విక్రయించడానికి కొందరు అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారు. సర్వే నంబరు వేయకుండా కేవలం ఇంటి నంబర్‌తో రిజిస్ట్రేషన్ తతంగం పూర్తిచేస్తున్నారు. ఇందుకు భారీగా డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలొస్తున్నాయి. ఒక్క గడ్డపోతారంలోనే 2022 నుంచి ఈ ఏడాది గత ఫిబ్రవరి వరకు 17 అక్రమ రిజిస్ట్రేషన్లు పూర్తయినట్లు ఇప్పటికే అధికారులు నిర్ధారించారు. ఇంకా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతామని జిన్నారం మండల పంచాయతీ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు.

న్యాల్‌కల్ కస్తూర్బా విద్యార్థినులకు అస్వస్థత

11 మందికి ఆసుపత్రిలో చికిత్స



కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: న్యాల్‌కల్‌లోని కస్తూర్బా విద్యార్థినులు 11 మంది శుక్రవారం తీవ్ర దగ్గు, శ్వాస ఇక్కట్లతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఉపాధ్యాయులు జహీరాబాద్ వైద్య విధాన పరిషత్తు ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించారు. కస్తూర్బాలో భవనానికి రంగులు వేస్తున్నారు. ఆ వాసనతో బాలికలు అస్వస్థతకు గురయినట్లు వైద్యులు భావిస్తున్నారు. చికిత్స అనంతరం ఎనిమిది మంది కోలుకొని తిరిగి పాఠశాలకు వెళ్లారు. మరో ముగ్గురు చికిత్స పొందుతున్నారు. అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న బాలికల తల్లిదండ్రులు హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లారు. విద్యార్థినులు కోలుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. డీఈవో వెంకటేశ్వర్లు ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం కేజీబీవీని తనిఖీ చేశారు. బాలికలకు అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని, వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జీసీడీవో మాధవి, సీఎంవో వెంకటేశం, మండల విద్యాధికారి మాధురి, ఎంపీడీవో రాజశేఖర్ వెంట ఉన్నారు.

న్యాక్ శిక్షణతో నిరుద్యోగులకు ఉపాధి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: న్యాక్ శిక్షణతో నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధికి భరోసా దక్కుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్ పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో 'న్యాక్'లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం ఉపాధి శిక్షణ పొందిన తర్వాత పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేందుకు న్యాక్ శిక్షణ దోహద పడుతుందన్నారు. సదస్సులో కార్మిక శాఖ అధికారులు యాదయ్య, నీరజ, న్యాక్ డైరెక్టర్ రాము తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చకపోతే చర్యలు

పుల్కల్, న్యూస్‌టుడే: కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే యాజమాన్యంపై కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ లేబర్ కమిషనర్ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. పుల్కల్ మండల పరిధి ఎస్.ఇటిక్యాలలోని ఎంఎస్ ఇండస్ట్రీస్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కంపెనీ మేనేజర్, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. మూడు రోజులుగా బోనస్ కోసం కార్మికులు ధర్నా చేస్తున్నప్పటికీ ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్‌ను సకాలంలో జమ చేయాలన్నారు. కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

చెడు వ్యసనాల జోలికి వెళ్లొద్దు: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే కఠోర శ్రమ తప్పదని ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని రాయల్, శ్రీతేజ జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన సమావేశాల్లో ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివన్నారు. యువత చెడు వ్యసనాల జోలికి వెళ్లవద్దని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ర్యాగింగ్ తదితరాలపై 87126 56777 నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. మహిళలు, యువతుల రక్షణకు షీ బృందాలు పని చేస్తున్నాయన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్స్ కృపానిది, చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ కూన వేణుగోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపు బాధ్యత కార్యదర్శులదే: డీపీవో

కంది, న్యూస్‌టుడే: పల్లెల్లో రహదారుల వెంట నాటిన మొక్కలకు సంరక్షణ చర్యలు చేపట్టి.. పచ్చదనం పెంచాల్సిన బాధ్యత స్థానిక కార్యదర్శులదేనని డీపీవో సాయిబాబా పేర్కొన్నారు. శుక్రవారం 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా కంది మండలం కాశీపూర్‌లో పర్యటించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల, రెండు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో పి.శ్రీనివాస్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శి అరుణ్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆర్చరీ ఎంపికలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్చరీ బాల బాలికల అండర్-14, 17 ఎంపికలు ఈ నెల 27న ఉదయం 10 గంటలకు కొల్లూరులోని దిల్లీ పబ్లిక్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి అమూల్యమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంట్రీ ఫారం, ఒరిజినల్ బోనఫైడ్ పత్రంతో హాజరు కావాలని పేర్కొన్నారు.





(c) eenadu



ఒడిదొడుకులు దాటి.. సివిల్స్ సాధించి..

న్యూస్‌టుడే, తూప్రాన్, మనోహరాబాద్

ఒకరిది పేద కుటుంబం.. మరొకరికి అత్యున్నత ఉద్యోగమే లక్ష్యం.. ఇలా తమ లక్ష్యాల సాధనకు ఎంతో శ్రమించారు. ఎన్నో అడ్డంకులను అధిగమించారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసి తాము అనుకున్నది సాధించారు. లక్షల మంది పోటీపడిన ఈ పరీక్షల్లో తామెంటో నిరూపించుకున్నారు. ఎన్నో ఒడుదొడుకులు దాటుకొని ఇక్కడి వరకు వచ్చారు. ప్రజాసేవే ధ్యేయంగా సివిల్ సర్వీసెస్ సాధించిన వారంతా పల్లెల బాట పట్టారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలు లబ్ధి పొందుతున్న తీరు, జీవనస్థితిగతులను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి పర్యటనకు మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్, మనోహరాబాద్ మండలం కూచారం గ్రామాలకు వచ్చారు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే' వారిని పలకరించింది. ఆయా విశేషాలు వారి మాటల్లోనే ఇలా..

కిరాణా వ్యాపారి కుమారుణ్ని



మాది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మహాసముండ్ గ్రామం. మధ్యతరగతి కుటుంబం. 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. తండ్రి కిరాణా దుకాణం నిర్వహిస్తూ మమల్ని పోషించారు. తల్లి గృహిణి. నాన్నకు సహకారాలు అందించేది. ఇంట్లో కష్టాలను చిన్నప్పటి నుంచి చూశా. వాటిని అధిగమించాలంటే ఉన్నత స్థానానికి చేరాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. సివిల్స్ సాధించడమే ధ్యేయంగా సన్నద్ధమయ్యా. రెండుసార్లు విఫలం కాగా, మూడోసారి ఉత్తమ ర్యాంకు సాధించగా ఐపీఎస్ వచ్చింది. కరోనా సమయంలో ఎంపికయ్యా. దీని కారణంగా క్షేత్రస్థాయి శిక్షణ పూర్తికాలేదు. అందులో భాగంగానే ఇప్పుడు ఇక్కడికి వచ్చా. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో ఉద్యోగం చేస్తున్నా. చదువుకు కులమతాలు, ధనిక, పేద అన్న తేడా లేదు. కష్టపడితే ఏదైనా సాధ్యమే. యువతీ, యువకులు అందరూ గమ్యం నిర్దేశించుకుని తల్లిదండ్రుల కలను సాకారం చేయాలి.

– ఆకాష్‌కుమార్ శుక్లా, ఐపీఎస్ అధికారి

సాఫ్ట్‌వేర్ కొలువు కాదనుకొని..



మాది ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవూ. ఐఐటీ బొంబాయిలో బీటెక్ పూర్తి చేశా. చిన్నప్పటి నుంచి ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు పడలేదు. బీటెక్ తర్వాత సాఫ్ట్‌వేర్ కంపెనీలో అత్యున్నత జీతంతో ఉద్యోగం వచ్చింది. కొద్దిరోజులు ఉద్యోగం చేశా, అది నచ్చలేదు. ప్రజలకు ఏదైనా సేవ చేయాలన్న తలంపుతో సివిల్ సర్వీసెస్‌ను ఎంచుకున్నా. ఐఏఎస్ ఉద్యోగమే లక్ష్యంగా అడుగేశా. శిక్షణ తీసుకున్నా. రెండుసార్లు సివిల్స్ రాసి విఫలమయ్యా. అయినా కుంగిపోలేదు. కుటుంబ సభ్యులు సహకారం అందించారు. మూడోసారి విజయం వరించగా, ఐఈఎస్(ఇండియన్ ఎకానమిక్ సర్వీస్) వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవనంలో మార్పు తీసుకురావాలంటే ప్రభుత్వం ఎంతో చేయాల్సి ఉంటుంది. అందులో సివిల్ సర్వీస్ అధికారులదే కీలక పాత్ర. నేటి యువత పోటీ పరీక్షల్లో ఉద్యోగం రాలేదని ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ధైర్యంగా ముందుకు సాగితే విజయం ఖాయం.

– జాన్విపటేల్, లఖ్‌నవూ, ఉత్తర్‌ప్రదేశ్

నాన్న స్ఫూర్తిగా అడుగేశా..



నా స్వగ్రామం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్. నాన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ గృహిణి. చిన్నతనంలోనే సివిల్స్ సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. ఈ విషయంలో నాన్నే నాకు స్ఫూర్తి. ఆయన సూచనలతో ముందుకు సాగా. పోటీ పరీక్షల్లో రాణించేందుకు మెళకువలు నేర్చుకున్నా. రోజులో 16 గంటల పాటు చదివా. సివిల్స్‌కు సంబంధించిన అన్ని విషయాలపై అవగాహన పెంచుకున్నా. దీని గురించి చరవాణిని సైతం కొన్నాళ్లు దూరంగా ఉంచా. అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగించా. 2023లో తొలిసారిగా పరీక్ష రాయగా ఉత్తీర్ణత సాధించా. ఐఈఎస్(ఇండియన్ ఎకానమిక్ సర్వీస్) వచ్చింది. క్షేత్రస్థాయి పర్యటనలో పల్లెల్లో పథకాలు అమలు చేస్తే ప్రజలకు ఎంతో మేలు చేయవచ్చని తెలుసుకున్నా.

– వైభవ్ రాథోడ్, శిక్షణ ఐఈఎస్ అధికారి

తెలంగాణ క్యాడర్‌లోనే..



మాది మహారాష్ట్ర. నాన్న కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఆయన స్ఫూర్తితోనే పోలీసు శాఖలో సేవలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. అందులోనూ ఐపీఎస్ సాధించాలని సంకల్పించుకున్నా. దీని గురించి అన్ని అంశాలను తెలుసుకున్నా. చిన్నప్పటి నుంచి పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకున్నా. మొదటి సారి పరీక్ష రాయగా విఫలమయ్యా. రెండోసారి విజయం సాధించా. అత్యుత్తమ ర్యాంకు రాగా, ఐపీఎస్‌కు ఎంపికయ్యా. ప్రస్తుతం తెలంగాణ క్యాడర్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నా. క్షేత్రస్థాయి శిక్షణ పూర్తికాకపోవడంతో ఇప్పుడు ఇక్కడికి వచ్చా. నా తండ్రి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో కష్టపడి చదివా. రోజులో 16 గంటలు దీనికే కేటాయించా. ఆత్మవిశ్వాసంతో అడుగేస్తే విజయం ఖాయమని నా ఉద్దేశం.

– చేతన్‌నితిన్, ఐపీఎస్ అధికారి

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ప్రతినిధి జశ్వంత్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: రోబోటిక్స్ విద్యతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడంతో పాటు సమస్యల పరిష్కార నైపుణ్యాలు మెరుగుపర్చడమే ప్రధాన ధ్యేయమని సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ప్రతినిధి జశ్వంత్ అన్నారు. శుక్రవారం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ సహకారంతో రోబోటిక్స్ ఆన్ అకాడమిక్ (ఆర్ఐఏ) అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జశ్వంత్ మాట్లాడుతూ. . సైన్స్‌ను ఇష్టంగా అభ్యసించాలని, తద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 16 జిల్లాల్లోని 285 పాఠశాలల్లో 47,875 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ ఇచ్చామని చెప్పారు. త్వరలో మరిన్ని చోట్ల ప్రారంభిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ.. రోబోటిక్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. భౌతికశాస్త్రం విద్యార్థులు 80 మందికి శిక్షణ ఇచ్చారు. జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి సింహారెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధనలక్ష్మిగా వాసవీమాత



దుబ్బాక పట్టణం వైశ్యభవన్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. అమ్మవారిని రూ.II లక్షల కరెన్సీ నోట్లతో ధన లక్ష్మి మాతగా అలంకరించి పూజలు చేశారు.

- న్యూస్‌టుడే, దుబ్బాక

రోగుల నాడి పట్టి చూస్తున్నారా..!



నర్సాపూర్ ఆసుపత్రిలో సేవలపై ఆరా తీస్తున్న రాష్ట్ర కమిషనర్ అజయ్ కుమార్

నర్సాపూర్, కౌడిపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా ఉంటూ, వారి నాడి పట్టి పరీక్షించాలని రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ స్పష్టంచేశారు. శుక్రవారం నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇన్‌పేషంట్ల విభాగం, ఓపీ నిర్వహణను పరిశీలించారు. వేచి ఉన్న రోగులతో మాట్లాడారు. వైద్యులు నాడి పట్టి చూస్తున్నారా, అవసరమైన మందులు ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలందించాలని ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ పావనికి సూచించారు. జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకుడు డాక్టర్ శివదయాల్, వైద్యులు మిర్జాబేగ్, రాజేష్, వంశీ తదితరులున్నారు. అనంతరం కౌడిపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న సామాజిక ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఇక్కడికొచ్చే రోగుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని స్పష్టంచేశారు. వైద్యులు, సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని సూచించారు. వైద్యురాలు మహిమ, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ ఉన్నారు.

ఐఐటీహెచ్‌లో అంకుర సంస్థల సదస్సు

సంగారెడ్డి టౌన్, కంది, న్యూస్‌టుడే: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల ఉత్పత్తిదారులకు చేయూతే లక్ష్యంగా సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీహెచ్‌లో శుక్రవారం స్టార్టప్, ఇన్వెస్టర్ల సదస్సు నిర్వహించారు. వీసీ సర్కిల్-ప్యూర్ ఈవీ అంకుర సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 60 అంకుర సంస్థలు, 130 మంది యువ పారిశ్రామికవేత్తలు, దేశ విదేశాలకు చెందిన 30 మంది పెట్టుబడిదారులు ఇందులో భాగస్వాములయ్యారు. అంకుర సంస్థల ప్రతినిధులు తమ ఆలోచనలను పెట్టుబడిదారుల ముందుంచారు. ఆధునిక సాంకేతికత ఆలోచనతో రూపొందించిన ప్రాజెక్టులతో ముందుకు వచ్చే అంకుర సంస్థల్లో పెట్టుబడులకు పలువురు ఆసక్తి చూపారు. అంతకు ముందు 'భారత దేశంలో ఎలక్ట్రిక్ వాహన విప్లవం-భవిష్యత్తు' అనే అంశంపై రూపొందించిన శ్వేతపత్రాన్ని ఐఐటీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్, ప్యూర్ ఈవీ(ఎలక్ట్రికల్ వెహికిల్) వ్యవస్థాపక ఛైర్మన్ డా.నిశాంత్ దొంగరి ఆవిష్కరించారు.

ఇంట్లో చోరీ.. ముగ్గురు మహిళల అరెస్టు

కల్హేర్, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేసిన ముగ్గురు మహిళలను అరెస్టుచేసి ఆభరణాలతో పాటు నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కల్హేర్ ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాలు.. ఈనెల 15న కల్హేర్‌కు చెందిన బత్తిని పద్మవ్వ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ విషయం పసిగట్టిన ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు చెగోళ్ల చంద్రకళ, మీసాల గంగవ్వ, అల్లాపూరం ఉమారాణిలు జతకలిసి అదేరోజు పద్మవ్వ ఇంటి తాళం పగులగొట్టి ఆభరణాలతోపాటు నగదు చోరీకి పాల్పడ్డారు. నిందితులు సొత్తును సమీపంలోని గ్రామంలో అమ్మకం చేయడంతో విషయం బయటకు వచ్చింది. కేసు విచారణ ప్రారంభించిన పోలీసులు నిందితులు అమ్మిన రెండు తులాల బంగారు పుస్తెల తాడు, 20 తులాల వెండి కడియాలు, పది తులాల పట్టగొలుసులతో పాటు రూ.30 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

కారు షెడ్డులో అగ్నిప్రమాదం

ఆహుతైన 9 వాహనాలు



కాలిపోయిన కార్లు

తూప్రాన్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి నర్సాపూర్ చౌరస్తా సమీపంలోని కారు షెడ్డులో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఎస్సై శివానందం తెలిపిన వివరాలు.. నర్సాపూర్ చౌరస్తా సమీపంలో కారు మెకానిక్ షెడ్డు ఉంది. గురువారం రాత్రి ఎప్పటిలాగే షెడ్డుకు తాళం వేసి నిర్వాహకులు, కార్మికులు వెళ్లిపోయారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కార్లున్న షెడ్డులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో అందులోని తొమ్మిది కార్లు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానికులు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక యంత్రాలు మంటలను అదుపులోకి తెచ్చాయి. షెడ్డులోని కార్లు కాలిపోయాయి. ప్రమాదం ఎలా జరిగిందనే విషయమై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మోసపోయాం న్యాయం చేయండి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

మోమిన్‌పేట: మేము కొనుగోలు చేసిన స్థలాల్లో, పంటలు సాగు చేస్తున్నారని, మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితులు రెవెన్యూ అధికారులకు శుక్రవారం విన్నవించారు. అధికారులు, బాధితులు తెలిపిన ప్రకారం మండల పరిధి ఎన్కేపల్లి శివారు 86 సర్వే నంబరులో షేక్‌బద్రోద్దీన్ వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి, ప్లాట్లుగా విక్రయించాడు. 34 మందికి వికారాబాద్‌లో రిజిస్ట్రేషన్ చేశాడు. లేఅవుట్ లేని భూముల్లో ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసిన వారి ప్లాట్లను ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో బాధితులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇంటి స్థలాలు పరిశీలించేందుకు అధికారులు శుక్రవారం వస్తారని పంచాయతీ కార్యదర్శి పార్వతమ్మ దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారంతా పత్రాలతో కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాల వద్దకు వెళ్లి చూడగా, ఆ భూమి చుట్టూ ప్రహరీ ఉండడంతో వారికి ఏంచేయాలో అర్థం కాలేదు. స్థలాలు చూపిస్తేనే ఎల్ఆర్ఎస్ చేసే వీలుంటుందని క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన అధికారులు చెప్పడంతో ఆందోళనకు గురయ్యారు. తమకు జరిగిన అన్యాయాన్ని ఉప తహసీల్దార్ సురేష్‌కు వివరించి, వినతిపత్రం ఇచ్చారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 115-00	డ్రెస్డ్	199-00
రిటైల్ 137-00	స్కిన్‌లెస్	226-00

పిడుగు గుట్టు తెలిపేలా..

ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసినప్పుడు ఎక్కడో చోట పిడుగు పడిందని మనకు తెలుస్తుంటుంది. దాని కారణంగా మనుషులు సైతం మృతి చెందుతుంటారు. అత్యధికంగా అటవీ ప్రాంతం, ఎత్తయిన కొండ ప్రాంతాల్లో ఇవి పడుతుంటాయి. పిడుగుపాటు ప్రమాదాన్ని ముందే గుర్తించేలా భారత వాతావరణ విభాగం, శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దామిని లైట్‌నింగ్ అలర్ట్ పేరిట దీన్ని రూపొందించింది. దీని ద్వారా మనం ఉన్న ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో లేదో ముందే తెలుసుకొని జాగ్రత్త పడొచ్చు.



యాప్‌లో వివరాలు

హెచ్చరించేలా..

భారత వాతావరణ విభాగం (ఐఎండీ), శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఐఐటీఎం పూణే రూపొందించిన దామిని లైట్‌నింగ్ అలర్ట్ (Damini lightning Alert) యాప్ ద్వారా ముందే పిడుగుపాటును తెలుసుకోవచ్చు. ముందుగా ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ లేదంటే యాపిల్ యాప్‌స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం ఫోన్‌లో జీపీఎస్ ఎనేబుల్ చేసి పేరు, మొబైల్ నంబరు, చిరునామా, పిన్‌కోడ్ వంటి వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత మీరున్న ప్రాంతానికి 20-40 కి.మీ. పరిధిని ఒక సర్కిల్‌గా చూపిస్తుంది. అక్కడ పిడుగు పడుతుందా, లేదంటే ఎంత సేపట్లో పడుతుందనేది హెచ్చరిస్తుంది. ఆయా హెచ్చరికలను మూడు రంగుల్లో (ఎరుపు, పసుపు, నీలం) వ్యవధి సమయాన్ని సూచిస్తుంది.

- ఎరుపు ఉంటే 7 ని.లు, పసుపు ఉంటే 10-15 ని., నీలం ఉంటే 18-25 నిమిషాల్లో అక్కడ పిడుగు పడే వ్యవధిని సూచిస్తుంది.

మేఘాలు ఢీకొని..

ఆకాశంలో వేగంగా కదిలే మేఘాలు ఒకదాన్ని ఒకటి ఢీకొన్నప్పుడు విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దాని ప్రసరణకు ఒక వాహకం అవసరం. భూమ్యాకర్షణతో పిడుగు రూపంలో నేలపైకి విద్యుత్తు ప్రసరిస్తుంది. దీని శక్తి సూర్యుడి ఉపరితల శక్తి కన్నా ఎన్నో రెట్లు ఎక్కువని పలు పరిశోధనల్లో తేలింది. మేఘాలు, భూమికి మధ్య ఉండే గాలి పిడుగును నేల వైపునకు చేరుస్తుంది. ఒక పిడుగుతో సుమారు 30 కోట్ల వోల్టుల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని అంచనా.

యాప్ రాడార్ ద్వారా సమాచారాన్ని సేకరించి జీపీఎస్ ద్వారా మనకు తెలియజేస్తుంది. తెలుగుతో పాటు 23 భాషల్లో సమాచారం అందిస్తుంది. మనం ఉన్న ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉంటే యాప్ నోటిఫికేషన్ వస్తుంది. తద్వారా అప్రమత్తం కావొచ్చు. పొలాల వద్ద పని చేసే రైతులు, పశుకాపరులు, ఆరు బయట పనిచేసే వారికి ఇదెంతో ఉపయోగకరం.

- న్యూస్‌టుడే, పాపన్నపేట

రైతులకు ఉపాధినిచ్చే పనులకే ప్రాధాన్యం



వివరాలు ఆరా తీస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర ప్రోగ్రాం అధికారి కృష్ణమూర్తి

చేర్యాల (మద్దూరు), న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకం కింద 2025-26 సంవత్సరానికి గాను రూపొందిస్తున్న ప్రణాళికలో రైతులకు ఉపాధితో పాటు ప్రజా ప్రయోజనం ఉన్న పనులకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎన్ఆర్ఈజీఎస్ ప్రోగ్రాం రాష్ట్ర మేనేజరు కృష్ణమూర్తి సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరు, ధర్మారం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. గతేడాది చేపట్టిన పనులు, వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తయారు చేసిన ప్రణాళికలో పేర్కొన్న పనుల ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. పనుల్లో ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉండేలా చూడాలన్నారు. అందరికీ ఉపయోగపడే వాటికే ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. శతశాతం పూర్తిచేసేలా కార్యాచరణ ఉండాలని స్పష్టంచేశారు. జిల్లా ఏపీడీ శివాజీ, కోఆర్డినేటర్ (లైజన్ అధికారి) నూరుద్దీన్, ఎంపీడీవో రామ్మోహన్, ఏపీవో పరశురాములు, సాంకేతిక సహాయకులు దేవేందర్, శ్రీనివాస్, వెంకటమ్మ తదితరులున్నారు.

కళాఉత్సవ్ పోటీల్లో కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ



బృందగానంలో పాల్గొన్న విద్యార్థులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఏక్‌భారత్ శ్రేష్ఠ్‌భారత్‌లో భాగంగా ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నంలో నిర్వహించిన కళాఉత్సవ్ పోటీల్లో సిద్దిపేట కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలలోని ఏడు నుంచి 10వ తరగతికి చెందిన 12 మందితో కూడిన బాలబాలికల జట్టు అక్కడి రీజినల్ స్థాయిలో నిర్వహించిన బృందగానం పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని విద్యాలయ ప్రిన్సిపల్ సూర్యప్రకాశ్, కో-ఆర్డినేటర్లు సంధ్య, పీఈటీ భూమయ్య తెలిపారు. నవంబరు 11 నుంచి మూడు రోజులపాటు హైదరాబాద్ తిరుమలగిరి కేంద్రీయ విద్యాలయలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో ఈ బృందం పాల్గొంటుందని వారు వెల్లడించారు. ఈ మేరకు విజేతలను అభినందించారు.

భార్యను హత్య చేసిన భర్త రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంతోష్‌కుమార్

న్యూస్‌టుడే, తాండూరు: భార్యను కొట్టి చంపిన భర్తను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం యాలాల మండలం కమాల్‌పూర్ గ్రామానికి చెందిన మ్యాతరి శ్రీకాంత్, ఆయన భార్య సుజాత(23) పాత తాండూరు రైల్వేగేటు సమీపంలో నివాసం ఉంటున్నారు. భార్యను అనుమానించిన శ్రీకాంత్ గురువారం రాత్రి ఆమెపై దాడి చేసి కొట్టాడు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం తెలియడంతో వెంటనే అక్కడికి వచ్చి జిల్లా ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నామని వివరించారు.

ద్విచక్ర వాహనాల దొంగ జైలుకు..

రాయపోల్, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొగుట సీఐ లతీఫ్ పేర్కొన్నారు. రాయపోల్ ఠాణాలో ఆయన వెల్లడించిన వివరాలు.. రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామానికి చెందిన కోనేరు యాదగిరి మద్యానికి బానిసయ్యాడు. 15 రోజుల క్రితం మరోవ్యక్తితో కలిసి హైదరాబాద్‌లో బోయిన్‌పల్లి మార్కెట్ సమీపంలోని బాపూజీనగర్‌లో రోడ్డుపక్కన నిలిపిన బైక్‌ను దొంగిలించి అనాజీపూర్‌లో ఓ వ్యక్తికి విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఈనెల 18న రాయపోల్ వైన్స్‌లో మద్యం తాగి జీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ ముందు నిలిపిన స్కూటీని దొంగిలించారు. శుక్రవారం స్కూటీని హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తుండగా రాయపోల్ సబ్‌స్టేషన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా దొంగతనం కేసులు బయటపడ్డాయని సీఐ వివరించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనకు సిద్ధమవుదాం..

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట, సిద్దిపేట, వికారాబాద్ కలెక్టరేట్

నవంబరులో నిర్వహణకు ఆదేశాలు



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు

భావి శాస్త్రవేత్తలను రూపొందించడమే లక్ష్యంగా కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా విజ్ఞాన ప్రదర్శనలను నిర్వహిస్తోంది. వారి ఆలోచనలకు అనుగుణంగా నమూనాలను రూపొందించి ప్రదర్శించే అవకాశం కల్పిస్తారు. 2023-24కు సంబంధించి ఇన్‌స్పైర్ మనక్, ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. గతేడాది వరకు ఈ రెండింటిని వేర్వేరుగా ఏర్పాటు చేయగా, ఈ సారి ఒకేసారి నిర్వహించాలని కేంద్రం ఆదేశించింది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఈ మేరకు ప్రదర్శనలను నవంబరులో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉపాధ్యాయులు దృష్టిసారించాలి..



విద్యార్థులు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సిద్ధం కావాలి. ఇందులో పాల్గొనేందుకు విద్యాశాఖ గుగూల్ ఫామ్‌లో నవంబరు మొదటి వారం లోపు వివరాలు నమోదు చేయాలి. అదే నెలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తాం. మరోవైపు ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికైన వారు సైతం సిద్ధం కావాలి. గైడ్ ఉపాధ్యాయులు ఈ దిశగా దృష్టిసారించాలి.

- సిద్దారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, సంగారెడ్డి

ఇన్‌స్పైర్‌లో ఎంపికైనవే..

ఈ సారి రెండు ప్రదర్శనలు కలిపి నిర్వహిస్తున్నా.. ఇన్‌స్పైర్ మనక్‌లో మాత్రం కేవలం ఎంపిక చేసిన విద్యార్థులు మాత్రమే పాల్గొనాలి. ఇందుకు ఒక్కో విద్యార్థికి ప్రాజెక్టు తయారీ నిమిత్తం రూ.10 వేలు వారి ఖాతాలో జమచేస్తారు. అంతర్జాలంలో నమోదు చేసిన నమూనాను మాత్రమే ప్రదర్శించాలి. ఇన్‌స్పైర్ మనక్‌లో గతేడాది ఆరు నమూనాలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాల నుంచి రెండు చొప్పున ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. మెదక్ నుంచి ఒక్కటీ ఎంపిక కాలేదు.

నిర్దేశించిన అంశాలు

ప్రధాన: సుస్థిర భవిష్యత్తుకు శాస్త్ర సాంకేతిక

ఉప అంశాలు

1. ఆరోగ్యం, ఆహారం, పరిశుభ్రత
2. రవాణా కమ్యూనికేషన్
3. సహజ వ్యవసాయం
4. విపత్తుల నిర్వహణ
5. గణిత నమూనాలు, గణన ఆలోచన
6. వ్యర్థాల నిర్వహణ
7. వనరుల నిర్వహణ

14 మందికి..

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జూనియర్ విభాగంలో 6-8 తరగతులు, సీనియర్ విభాగంలో 9, 10 తరగతులకు అవకాశం కల్పిస్తారు. నిర్దేశించిన ప్రధానంశంతో పాటు ఉప అంశాల్లో నమూనాలు తయారు చేయాలి. ఒక్కో పాఠశాల నుంచి 14 మంది పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఒక ఉపాధ్యాయుడు గైడ్‌గా వ్యవహరిస్తారు. మరోవైపు ఉపాధ్యాయులు, బీఈడీ, డీఈడీ విద్యార్థులు సైతం తాము రూపొందించిన నమూనాలను ప్రదర్శించవచ్చు. ఇందుకు విద్యాశాఖకు సంబంధించిన గుగూల్ ఫామ్‌లో పూర్తి వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది.

నాలుగు జిల్లాల్లో ఎంపిక ఇలా..

సంగారెడ్డి	93	సిద్దిపేట	188
మెదక్	38	వికారాబాద్	54

ప్రయాణికులను సురక్షితంగా చేర్చడమే లక్ష్యం



పురస్కారాలు అందుకున్న సిబ్బందితో ఆర్ఎం ప్రభులత, డిపో మేనేజర్ సురేఖ, అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యం ముందుకు సాగాలని ఆర్టీసీ మెదక్ ప్రాంతీయ మేనేజర్ ప్రభులత సిబ్బందికి సూచించారు. శుక్రవారం మెదక్ ఆర్టీసీ డిపో, గ్యారేజ్‌ను పరిశీలించి డిపో మేనేజర్ సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రజల్లో ఆర్టీసీపై ఆదరణ పెరిగేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ప్రశంసా పత్రం, నగదు పురస్కారాలు అందజేశారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన ఆరుగురు మహిళలను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, కార్యాలయ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



జంబికుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, తదితరులు

సిర్గాపూర్, కల్హేర్, నారాయణఖేడ్: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి, చివరి గింజ వరకు కొంటామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సిర్గాపూర్ మండలం బొక్కస్‌గాంలో, నిజాంపేట్ మండలం జంబికుంటలో, కల్హేర్ మండలం బీబీపేట్ తదితర గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఏడీఏ నూతన్‌కుమార్, ఎంపీడీఓ రమేష్‌బాబు రైతులు పాల్గొన్నారు. ● ఖేడ్ ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల గ్రంథాలయంలో శుక్రవారం సర్వోదయ ఫౌండేషన్ రూ.లక్షతో సమకూర్చిన పుస్తకాలు ఆవిష్కరించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రధానంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధే తన లక్ష్యమన్నారు. కమిషనర్ జగ్జీవన్, ఉప ఛైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్ వివేకానంద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, వైస్ ప్రిన్సిపల్ నారాయణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వర్ రావు, బీసీ గురుకులం ప్రిన్సిపల్ శ్రీను పాల్గొన్నారు.

సుందరీకరణ.. సుదూరం!

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జహీరాబాద్, సదాశివపేట, జోగిపేట టౌన్, నారాయణఖేడ్: పురపాలికల్లో సుందరీకరణను అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధాన చౌరస్తాలు, కూడళ్లు దారులు అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సుందరీకరణకు గతంలో పురపాలక అధికారులు ప్రతిపాదనలు రూపొందించిన నిధులు రాకపోవడంతో పనులు చేపట్టలేదు. జాతీయ రహదారిపై పోతిరెడ్డిపల్లి చౌరస్తా, పాత బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్, సాయిబాబా దేవాలయ కమాన్ ప్రాంతాల్లో సుందరీకరణకు అధికారులు పట్టించుకోవడం లేదు. పాదచారులు నడిచి వెళ్లేందుకు స్థలం లేకుండా పోయింది. పండ్ల వ్యాపారులు రోడ్లపైనే విక్రయిస్తున్నారు. పనులు పూర్తయితే ఈ రోడ్డుపై సుందరీకరణ జరుగుతోంది. మిగతా ప్రాంతాలు కూడా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



ఖేడ్ అంబేడ్కర్ కూడలిలో కూరగాయల విక్రయాలు

దృష్టిసారించని పుర అధికారులు



సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలో...

అనేక సమస్యలు

జహీరాబాద్ పట్టణంలో 65వ నంబర్ జాతీయ రహదారి సుమారు 9కిలో మీటర్ల మేర కొనసాగుతుంది. బస్టాండు, బ్లాక్ రోడ్డు, భవాని మందిరం, హనుమాన్ మందిర్, రైల్వే ఓవర్ బ్రిడ్జిల వద్ద ప్రధాన కూడళ్లను ఆధునికీకరిస్తామని ఐదారేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతూనే ఉన్నా.. నేటికి అభివృద్ధికి నోచుకోలేదు. ఇరువైపుల చిరు వ్యాపారాలు, తోపుడు బండ్లతో కూడళ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీనిపై పురపాలక కమిషన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించినట్లు పేర్కొన్నారు.

కూడళ్లపై నిర్లక్ష్యం!

సదాశివపేట పట్టణంలోని గాంధీచౌక్‌లో చిన్నపాటి వర్షం పడితే జలమయం అవుతోంది. ఇక్కడ నాలుగు ప్రధాన రహదారులు కలుస్తాయి. వర్షం నీరు వెళ్లే మార్గం లేక రోజుల తరబడి నిలుస్తోంది. మురుగు కాల్వలు మూసివేయడంతో వర్షం, వృథా నీరు ఇక్కడికే చేరి నిలుస్తోంది. ఇప్పటికైనా పురపాలిక అధికారులు స్పందించి వర్షం నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఖేడ్ పట్టణంలోని కూడళ్లు సుందరీకరణకు నోచుకోవడంలేదు. పట్టణంలో రాజీవ్ కూడలి, అంబేడ్కర్, శివాజీ, బసవేశ్వర, శివురావు షెట్కార్, అప్పారావు షెట్కార్, గాంధీ కూడళ్లు అస్తవ్యస్తంగా మారాయి. సుందరీకరణ చేపట్టలేదు. వివిధ సందర్భాల్లో వేడుకలకు సంబంధించిన ఫ్లెక్సీలను కూడళ్ల వద్ద ఏర్పాటు చేస్తుండటం ప్రమాదాలకు దారి తీస్తోంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)

సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, జోగిపేట, సంగారెడ్డి మున్సిపాలిటీ, సంగారెడ్డి అర్బన్:

? జోగిపేట పట్టణంలోని వాసవీనగర్ కాలనీలో జైరామ్ ఇంటి వద్ద వీధి దీపాలు వారం రోజులుగా వెలగడం లేదు. రాత్రిళ్లు కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. – **రాములు, జోగిపేట**

✓ కొత్త దీపాలు ఏర్పాటు చేస్తాం. – **తిరుపతి, కమిషనర్.**

? కన్‌సానిపల్లి నుంచి మర్వెల్లి, ఖాదిరాబాద్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా శిథిలమైంది. – **శ్రీనివాస్, కన్‌సానిపల్లి**

✓ నిధులు మంజూరు చేయించి తగు చర్యలు తీసుకుంటాం.
– **రవీందర్, ర.భ.శాఖ డిప్యూటీ ఈఈ, అందోలు**

? సంగారెడ్డిలోని వసంత్‌నగర్ కాలనీలో వీధి దీపాలు పూర్తి స్థాయిలో వెలగడం లేదు. రాత్రిళ్లు ఇబ్బంది పడుతున్నాం. – **శివకుమార్, సంగారెడ్డి**

✓ వెంటనే సిబ్బందిని పంపి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం.
– **ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ**

? పోతిరెడ్డిపల్లిలోని శిల్ప వెంచర్‌లో చెత్త సేకరణ సిబ్బంది సరిగా రావడం లేదు. చెత్త ఎక్కడ వేయాలో తెలియక అవస్థలు పడుతున్నాం.
– **వెంకటేశం, సంగారెడ్డి**

✓ చెత్త సేకరణ సిబ్బంది ప్రతిరోజూ వచ్చేలా సూచనలు చేస్తాం.
– **సైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు.**

? సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లి సమీపంలో శ్రీమాన్ నారాయణ ఎన్‌క్లేవ్‌లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. నెలరోజులుగా ఇబ్బంది పడుతున్నాం. – **పి.ప్రభులు, స్థానికుడు.**

✓ తమ సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తాం.
– **ప్రసాద్ చౌహాన్, పుర కమిషనర్, సంగారెడ్డి.**

కాలనీల్లో మౌలిక వసతులు



పనుల ప్రారంభంలో రోజారాణి తదితరులు

జిన్నారం: ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలోని మౌలిక వసతులు కల్పిస్తున్నామని పురపాలిక అధ్యక్షురాలు కె.రోజారాణి పేర్కొన్నారు. శుక్రవారం 9, 18 వార్డుల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కౌన్సిలర్ బీరప్పయాదవ్, ఏఈ కిష్టయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, జనార్దన్, సాయిరెడ్డి, కాంతారావు, బషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● ఖాజీపల్లి పంచాయతీ పరిధి జీఎంఆర్ 181 కాలనీలో రోడ్డు పనులు సాగుతున్నట్లు 'ఆర్కే ఫౌండేషన్' అధ్యక్షుడు రమాకాంత్ పేర్కొన్నారు.

బస్సు ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: ఖాదిరాబాద్‌కు చెందిన పోచయ్య శుక్రవారం ద్విచక్రవాహనంపై బొడ్మట్‌పల్లి నుంచి జోగిపేట వైపు అపసవ్య దిశలో వెళుతుండగా... ముస్లాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న ఖేడ్ ఆర్టీసీ డిపో బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో పోచయ్యకు గాయాలయ్యాయి. బస్సు చోదకుడు భీమ్లానాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి...

జోగిపేట: అన్నాసాగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న కార్మికుడు కిషన్‌కు విద్యుదాఘాతం తగలడంతో కింద పడి చేయి విరిగింది. అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు ఏఈ అలీ హుస్సేన్ పేర్కొన్నారు.

8 మంది జూదరులపై కేసు

మునిపల్లి, న్యూస్‌టుడే: బోడిషట్‌పల్లిలో జూదం ఆడుతున్న 8 మందిపై కేసు నమోదు చేసి రూ.48,380 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజేష్ నాయక్ శుక్రవారం తెలిపారు.

జేఎన్‌టీయూ కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన విద్యార్థినికి గుర్తింపు పత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ నర్సింహ

జోగిపేట: రక్తదానంతో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడవచ్చని జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపల్ నర్సింహ అన్నారు. శుక్రవారం చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కళాశాల, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి రెడ్ క్రాస్ సొసైటీలు సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 107 మంది కళాశాల విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాఘవేందర్‌రావు, ఎన్ఎస్ఎస్ అధికారి రజినీష్, సంగారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

'ఫీజు రీయంబర్స్‌మెంట్' విడుదలకు డిమాండ్



దీక్షలో పాల్గొన్న విద్యార్థులు

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: మూడేళ్లుగా విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్లోళ్ల మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జోగిపేట తహసీల్దార్ కార్యాలయం గేటు ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పట్టించుకోవడంలేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం విద్యారంగంపై స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజులు, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు బాలరాజు, మండల అధ్యక్షుడు ఉపేందర్, కార్యదర్శి హరిప్రభ, కమిటీ సభ్యులు శ్రీను, కుమార్, అభిషేక్, సాయి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విరిగిన గేటు.. మూతపడిన మార్గం!



హత్నూర మండల పరిధి దౌల్తాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం గేటు విరిగిపోవడంతో దారి మూతపడింది. వైద్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో గేటు నేలపై పడి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పెద్ద గేటును మాత్రమే ఉపయోగించాల్సి వస్తోంది. పెద్ద గేటు నిరంతరం తీసి ఉండటం వల్ల పశువులు లోపలికి ప్రవేశించి ఆవరణలోని మొక్కలు తినేస్తున్నాయి. దీనిపై వైద్యాధికారిణి దివ్యజ్యోతి 'న్యూస్‌టుడే' ప్రతినిధితో మాట్లాడుతూ త్వరలో గేటుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, హత్నూర.

నష్టపరిహారం చెల్లించండి

సదాశివపేట: వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని మంజీర రైతు సమాఖ్య అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల వల్ల పత్తి పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గిపోయిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు వెంకట్రావ్, నారాయణరెడ్డి, మల్లేశం, రాములు పాల్గొన్నారు.

నీటి సరఫరాను నిర్లక్ష్యం చేయొద్దు

జోగిపేట, వట్‌పల్లి: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని మిషన్ భగీరథ ఈఈ షేక్‌పాషా సూచించారు. జోగిపేటలోని ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం సబ్ డివిజన్ పరిధి నీటి సరఫరా విభాగం సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జోగిపేట సబ్‌డివిజన్ డిప్యూటీ ఈఈ శేషగిరిరావు, ఏఈలు లక్ష్మీపార్వతి, లక్ష్మీప్రసాద్, నీటి సరఫరా విభాగం సహాయకులు పాల్గొన్నారు. ● వట్‌పల్లి రైతు వేదికలో గ్రామాల్లో నీటి సరఫరాలో నాణ్యత, పైపులైన్ మరమ్మతులు, విద్యుత్తు సరఫరా, శుభ్రత పాటించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈఈ శేషాగిరి రావు,ఏఈవెంకటేశం,గోవింద్‌రాజుపాల్గొన్నారు.

'మాలల సమ్మేళనం' గోడ పత్రిక ఆవిష్కరణ

జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ పట్టణం అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం మాలల ఆత్మీయ సమ్మేళనం గోడ పత్రికను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సమ్మేళనానికి తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు. ఆ సంఘం డివిజన్ కార్యదర్శి దిలీప్‌కుమార్, నాయకులు బాలరాజ్, రాములు, రవికుమార్ పేర్కొన్నారు.

జాతర నిర్వహణకు విరాళం

జిన్నారం: మాదారంలో ఎల్లమ్మ జాతర నిర్వహణకు మాజీ సర్పంచి సరిత సురేందర్‌గౌడ్ శుక్రవారం రూ.20 వేల విరాళం అందించారు.

6న మహాయాగం

నారాయణఖేడ్: ఖేడ్‌లో వచ్చేనెల 6న 'లలితాదేవి వైభవం ట్రస్ట్' ఆధ్వర్యంలో నవ చండీ మహాయాగం నిర్వహించనున్నట్లు ట్రస్టు బాధ్యులు మోహన్‌జ్యోషి పేర్కొన్నారు.

అయోడిన్ లోపాన్ని గుర్తించండి

గుమ్మడిదల: గర్భిణుల్లో అయోడిన్ లోపం రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గుమ్మడిదల పీహెచ్‌సీ పర్యవేక్షకుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం అన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, మహిళలకు అయోడిన్ నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం కార్యదర్శి సంగీత, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి గ్రామంలో ర్యాలీ తీశారు.

టీపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

వట్‌పల్లి, న్యూస్‌టుడే: టీపీటీఎఫ్ వట్‌పల్లి మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాజర్ పటేల్ శుక్రవారం తెలిపారు. అధ్యక్షుడిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా రమేష్, వినయ్, శ్రావణ్‌కుమార్, యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్, కార్యదర్శులుగా శివకుమార్, సంజీవరెడ్డి, విపుల్, పరమేశ్వర్, శాదుల్లా ఎన్నికయ్యారు.

చెక్కు అందజేత

నారాయణఖేడ్: తుర్కపల్లికి చెందిన సాయిలుకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.8,500 చెక్కును శుక్రవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. ఖేడ్ మండల భారాస పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచి పరమేష్ పాల్గొన్నారు.

'ఉపాధి పనుల్లో అక్రమాలపై ఆగ్రహం

నారాయణఖేడ్: వెంకటాపూర్‌లో శుక్రవారం ఉపాధి హామీ పథకంపై గ్రామసభ నిర్వహించారు. పనిచేయకున్నా.. చేసినట్టు దస్త్రాలు సృష్టించి, లేని వారి పేర్లు కూలీలుగా నమోదు చేసి నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. ఏపీవో మాణిక్‌రావు, ఆడిటర్ మౌనిక, ఎస్ఆర్పీ శ్రీకాంత్, కార్యదర్శి విగ్నేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహేర్‌అలీ, మాజీ సర్పంచి గంగయ్య పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారి పర్యటన

కొండాపూర్, న్యూస్‌టుడే: మండల ప్రతేకాధికారి, ఏడీఏ వెంకటలక్ష్మి శుక్రవారం కొండాపూర్ మండలంలోని చీమలదారి కోనాపూర్, గొల్లపల్లి, మల్లేపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆస్పత్రి, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. సౌకర్యాలపై పలు సూచనలు చేశారు.

ఉపయోగపడే పనులు చేపట్టండి

జోగిపేట, న్యూస్‌టుడే: అందోలు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా చేపట్టే కొత్త పనుల గుర్తింపునకు శుక్రవారం జిల్లా అదనపు శిక్షణ కలెక్టర్ మనోన్ స్థానికంగా పర్యటించారు. రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించాలని ఆయన అధికారులకు సూచించారు.

'మల్చింగ్' విధానం మేలు

కొండాపూర్: మల్చింగ్ పేపర్ వేసుకుని కూరగాయలు, పూలు సాగు చేస్తే లాభాలు పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారిణి శైలజ పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలం మన్‌సాన్‌పల్లిలో పూలతోటలు పరిశీలించిన అనంతరం మాట్లాడారు.

ధర్నాకు తరలిన పుర కార్మికులు

నారాయణఖేడ్: హైదరాబాదులో చేపట్టిన ధర్నాలో పాల్గొనేందుకు ఖేడ్ పురపాలిక ఒప్పంద కార్మికులు పలు వాహనాల్లో తరలివెళ్లారు. శ్రమదోపిడికి గురవుతున్న కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేష్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

అభ్యసన సామర్థ్యాల మెరుగుకు కృషి: డీఈవో



శిక్షణలో పాల్గొన్న హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో డీఈవో వెంకటేశ్వర్లు తదితరులు

సిర్గాపూర్, న్యూస్‌టుడే: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేలా బోధన సాగించాలని డీఈవో, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. కడ్పల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం కడ్పల్‌లో ఉపాధి హామీ పనుల గుర్తింపునకు నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. హెచ్ఎంలు వెంకటేశం, బన్సీలాల్, ఏపీవో బస్వరాజ్, అరుణ్, రాములు పాల్గొన్నారు.

జహీరాబాద్: పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న గ్రంథాలయాలను సక్రమంగా నిర్వహించాలని డీఈఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. 'రీడ్ టు రూమ్' సంస్థ ఆధ్వర్యంలో జహీరాబాద్ డివిజన్‌లోని 30 ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలకు శుక్రవారం జహీరాబాద్ ఎంఆర్‌హెచ్ఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎంఈఓ ఎస్.బస్వరాజ్, ఆర్పీలు శ్రీహర్ష, తేజశ్వి, విజయశ్రీ, రవి, సంధ్య పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన పీఆర్టీయూ నాయకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను పీఆర్టీయూ నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని జిల్లా సైన్స్ కేంద్రం వద్ద సంఘం భవన నిర్మాణానికి భూమిపూజకు హాజరు కావాలని మంత్రిని కోరారు. పీఆర్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు మాణయ్య, కార్యదర్శి ప్రభు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన గిరిజాషెట్కార్

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ సామాజిక మాధ్యమ బాధ్యురాలు, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ కుమార్తె గిరిజాషెట్కార్‌తో పాటు పలువురు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. ● పార్లమెంటరీ సహకారశాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులుగా జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ నియమితులైన సందర్భంగా పలువురు ఖేడ్‌వాసులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.

ఎయిమ్స్‌లో సీటు సాధించిన విద్యార్థినికి సత్కారం

మునిపల్లి, న్యూస్‌టుడే: మునిపల్లి మండలం బుధేరాకు చెందిన రాజకుమారి నీట్‌లో ప్రతిభ చూపి తమిళనాడులోని ఎయిమ్స్‌లో సీటు సాధించారు. ఆమెను శుక్రవారం విశ్రాంత ఏఎస్పీ ఆనందం, ఎంఈఓ భీంసింగ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మనోహర్ తదితరులు హాజరై సన్మానించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

SRILALITHA
• RICE
• IDLY RAVVA • RICE RAVVA
• ATTA • MAIDA • SUJI
Valuthimmapuram Road, Peddapuram, A.P.
ఈ క్రింది ఏరియాలకు ఔట్లెట్ నిర్వహించుటకు కావలెను.
జనగాం, భూపాలపల్లి, కరీంనగర్, సిద్దిపేట, నిజామాబాద్, నర్సన్నపేట, సదాశివపేట. సంప్రదించండి
98481 32325
83175 11697
94948 54544

హైదరాబాద్ & తెలంగాణా జిల్లాల్లోని ప్రముఖ టెలికాం టవర్ కంపెనీలో పనిచేయడానికి డిప్లొమా / ITI చదివిన ఎలక్ట్రీషియన్లు కావలెను. ఫోన్: 9177333979

TOURS AND TRAVELS

గుజరాత్, నాగేశ్వరం, సోమనాథ్ ద్వారక, 8 రో|| 11 వేలు 21-11 * కర్నాటక, 22/11 శృంగేరి, గోకర్ణం మైసూర్, 7 రో|| 10,500/- * అన్ని టూర్స్ మా స్వంత వంట భోజనం & రూమ్స్ సత్యసాయి. 9618933189.

JOBS

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు|| ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్+ భో|| Hyd. Ph: 9182260297.

వినాయక డైరీ ప్రోడక్ట్స్‌లో పనిచేయుటకు M/F కావలెను. మంచి జీతం, వసతి ఇవ్వబడును. BHEL మెట్రో ఎన్‌క్లేవ్, పట్టేల్‌గూడ, near: పంచముఖ ఆంజనేయ స్వామి గుడి, బీరంగూడ, Hyd. ✆ 8919103019.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నిమ్జ్ భూముల పరిశీలన

ఝరాసంగం: నిమ్జ్‌లో భూములు కోల్పోయి పరిహారం అందని రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మీ పేర్కొన్నారు. శుక్రవారం ఎల్గోయిలోని సర్వే సంఖ్య 54లో భూములు కోల్పోయినా.. పరిహారం అందని స్థలాలు పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అర్హత ఉన్న రైతులకు పరిహారం అందేలా చొరవ తీసుకుంటానని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామారావు, సిద్దారెడ్డి, నరసింహులు ఉన్నారు.

కాలుష్యాన్ని పరిశ్రమలే కట్టడి చేసుకుంటే మేలు



రైతుకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, తదితరులు

జిన్నారం: రసాయన పరిశ్రమలు కాలుష్యాన్ని కట్టడి చేసుకొని పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని, మూగజీవాలను రక్షించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల జిన్నారం మండలం కిష్టాయపల్లికి చెందిన బశెట్టిగారి సంతోష్‌కుమార్‌కు చెందిన 18 గేదెలు మృతిచెందిన నేపథ్యంలో 'మోడల్ ఇండస్ట్రియల్ అసోసియేషన్' ఇచ్చిన రూ.16 లక్షల పరిహారాన్ని ఆయన బాధిత రైతుకు అందించారు. వచ్చిన పరిహారం డబ్బులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొన్ని రసాయన పరిశ్రమలు చేసిన తప్పిదంతో ఇతరులకు నష్టం కలుగుతుందన్నారు. భవిష్యత్తులో కాలుష్య సమస్య లేకుండా స్వీయ నియంత్రణ పాటించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ప్రకాశంచారి, శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు టీవీవీఎస్ఎన్ మూర్తి, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

'కార్మిక సంక్షేమ చట్టం' తీసుకురావాలి



కార్మికులతో మాట్లాడుతున్న చిరంజీవి

నారాయణఖేడ్: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టం తీసుకురావాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. శుక్రవారం భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం సంక్షేమం కోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్నారు.

కుదిరిన వేతన ఒప్పందం

జిన్నారం: ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలోని 'వింధ్యా ఆర్గానిక్స్ పరిశ్రమ'లో యాజమాన్యంతో రూ.10,100 వేతన ఒప్పందం కుదిరినట్లు కార్మిక సంఘం నాయకుడు వరప్రసాద్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్ నుంచి పత్రాలు తీసుకుని అధికారులకు, యాజమాన్యానికి కృతజ్ఞతలు చెప్పారు. పరిశ్రమజనరల్ సెక్రెటరీ భాస్కర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్, సతీష్, శంకర్ పాల్గొన్నారు.

గడువు పెంచుతూ.. పనుల సాగదీత!

సదాశివపేటలోని కందకం రహదారి తీరిది



విస్తరణ ఆగిపోయిన నాలుగు వరుసల కందకం దారి

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సదాశివపేట: పట్టణ ప్రజల రాకపోకలు సాఫీగా సాగేందుకు ప్రభుత్వం దారుల విస్తరణకు సంకల్పించి రూ.కోట్ల నిధులు మంజూరు చేసినా.. గుత్తేదారులు ఆర్భాటంగా పనులు ఆరంభించి ఆనక మరుస్తున్నారు. ఈ విస్తరణ పనులకు గడువులు పెంచుతూ.. పనుల్లో కాలం వెళ్లదీస్తుండటంతో ప్రజలకు తిప్పలు మాత్రం తప్పడంలేదు. సదాశివపేట పట్టణంలోని కందకం రహదారి విస్తరణ పనులు ఏళ్లుగా సాగుతున్నాయి.

నాలుగు వరుసల దారికి శ్రీకారం..

సదాశివపేట పట్టణంలోని చుట్టూ ఉన్న పురాతన కందకం పూడ్చి ప్రజలకు రాకపోకలకు అనువుగా నాలుగు వరుసల దారి విస్తరణకు ప్రభుత్వం 2012లో నిర్ణయం తీసుకుని రూ.20 కోట్లు కేటాయింపులు చేసింది. ఈ నిధులతో డివైడర్ పనులు, వంతెనలు, మురుగు కాల్వలు, సెంట్రల్ లైటింగ్స్ ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. ఇప్పటి వరకు రూ.8 కోట్ల మేర పనులు చేపట్టినా... పలు చోట్ల పనులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పనులు ఎప్పుడు పూర్తి చేస్తారోనని పట్టణవాసులు ఎదురు చూడాల్సి వస్తోంది. 2013లో పూర్తిచేయాల్సి ఈ పనులను పదకొండేళ్లుగా ఏటా ఆర్అండ్‌బీ అధికారులు గడువు పెంచుతున్నప్పటికీ పురగోతి మాత్రం కానరావడం లేదు.

పనులు వేగంగా చేసేలా చర్యలు..

జిల్లాకు కొత్తగా రాగానే సదాశివపేట కందకం దారి విస్తరణ పనులు పర్యవేక్షించా. మధ్యలో నిలిచిన పనులపై సంబంధిత గుత్తేదారుడితో మాట్లాడా. ఆయన జహీరాబాద్‌లో మరో పని చేయిస్తున్నారు. ఈ పనిని కూడా పూర్తిచేయించేలా చర్యలు తీసుకుంటా. మార్చి వరకు గడువు ఉంది. పట్టణ ప్రజలకు రవాణా మార్గం సాఫీగా సాగించేలా చర్యలు తీసుకుంటా. – **రామకృష్ణ, ఆర్అండ్‌బీ శాఖ , డిప్యూటీఈఈ, సంగారెడ్డి.**

ఓటు హక్కు వినియోగించుకోండి

న్యాల్‌కల్, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దార్ భూపాల్ శుక్రవారం పట్టభద్రులైన ఓటర్ల రెండో విడత ముసాయిదాను విడుదల చేశారు. అర్హులైన పట్టభద్రులు నవంబర్ 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9000014771
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001735

(c) eenadu